ప్రశాంత్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదం

రాజాపేట, జూన్ 15 : మండలంలోని బేగంపేటకు చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ తన జన్మదినం పురస్కరించుకొని శనివారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పూల మొక్క అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ గంధమల్ల సురేశ్ ఉన్నారు.

రాజాపేట హైస్కూల్‌ను సందర్శించిన డీఈఓ

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

రాజాపేట, జూన్ 15 : మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలను డీఈఓ నారాయణరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పనుల పురోగతి పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి పలు సూచనలు చేశారు. అనంతరం బడిబాట కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వచ్చే అవకాశం ఉందని, సభా వేదికను పరిశీలించి ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈఓ జంగిటి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు బూర్గు మహేందర్‌రెడ్డి, సీఎంఓ పెసరు లింగారెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు లేని చోట అధిక నిధులు ఎందుకు?

● భూదాన్‌పోచంపల్లి మండల సమావేశంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన మండలంలోని శివారెడ్డిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున అధిక నిధులు ఎందుకు కేటాయించారని ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ భవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తయ్యాయని, అర్హులైన పేదలకు వెంటనే కేటాయిస్తామని తెలిపారు. ప్రజాసేవ చేస్తేనే ప్రజలు ఆదరిస్తారని, రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్యా దవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, పీఆర్ఏఈ వెంకటేశ్, మండల వైద్యాధికారి శ్రీవాణి, ట్రాన్స్‌కో ఏఈ క్రాంతి, ఎంపీటీసీలు చిల్లర జంగయ్య, మొగిలిపాక యాదగిరి, బందారపు సుమలత, రావుల శ్రీదేవి, శంకరమ్మ, అమృతమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

ఆత్మకూరు(ఎం)లో మిషన్‌భగీరథ నీటి సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న గ్రామపంచాయతీ ఉద్యోగులు, వలంటీర్లు

ఆత్మకూరు(ఎం), జూన్ 15 : మిషన్ భగీరథ నీటి సరఫరాపై మండల కేంద్రంలో శనివారం గ్రామపంచాయతీ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటి సర్వే చేపట్టారు. నీటి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉన్నారు, రోజుకు ఎన్ని నీళ్లు వస్తున్నాయనే వివరాలు సేకరించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

● జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు

రామన్నపేట, జూన్ 15 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్‌మోహన్, రామన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సిరిగిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సిరిపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, హైదరాబాద్ యశోద దవాఖాన సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. 48 మంది దాతలు రక్తదానం చేశారు. వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ క్లబ్ మెంబర్ బొడ్డు శంకరయ్య, ఉపాధ్యక్షుడు పనకంటి భాస్కర్‌రావు, సభ్యులు బొడ్డు వెంకటేశం, గోవర్ధనాచారి, అనంతరెడ్డి, సూర్యనారయణ, విజయానందం, ప్రభాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురిగిరెడ్డి మల్లారెడ్డి, ఎంపీటీసీలు బడుగు రమేశ్, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఏడీపై చర్యలు తీసుకోవాలి

● యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతికుమార్

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతికుమార్

మోత్కూరు, జూన్ 15 : జిల్లాలోని ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులను మంజూరు చేయడంలో విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని గెజిటెడ్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరు యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 26 మంది ఉపాధ్యాయులు అనారోగ్యంతో చికిత్స పొంది కన్సర్మేషన్ ఆఫ్ జస్యూనెస్ సర్టిఫికేట్‌ను సమర్పించినప్పటికీ మంజూరు చేయడం లేదని, ముడుపుల ఇవ్వలేదని మెడికల్ బిల్లులను పెండింగ్ పెట్టి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏడీ ప్రశాంత్‌రెడ్డి నిర్లక్ష వైఖరి వీడి పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. లేకుంటే యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి, మండల ప్రధాన కార్యదర్శి ఎన్నారం సత్తయ్య, విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆకవరం వల్లబాయ్, సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి దర్బార్ సేవ

స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖమండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు జరిపారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ, రాత్రి తిరువారాధన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు చేపట్టారు. సుమారు 27 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.40,74,267 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వయో వృద్ధుల సంక్షేమ సంఘానికి విరాళం

చెక్కు అందజేస్తున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

బీబీనగర్, జూన్ 15 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వయో వృద్ధుల సంక్షేమ సంఘ ఆశ్రయ భవనాన్ని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి రూ.2 లక్షల చెక్కును సంఘం సభ్యులకు అందజేశారు. అనంతరం సంఘం సభ్యులు భిక్షమయ్యగౌడ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వయో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎర్రం మనోహర్, సభ్యులు బండారి ఆగమయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బొర్ర లింగారెడ్డి, సలహాదారుడు పంజాల పెద్ద రామాంజనేయులుగౌడ్, యాస నరసింహారెడ్డి, సురకంటి లక్ష్మారెడ్డి, సామ మల్లారెడ్డి, గొలనుకొండ ధర్మయ్య, సోమ నర్సింహ, కృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఫర్టిలైజర్ షాపులో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ఆలేరు రూరల్, జూన్ 15 : లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు సూచించారు. శనివారం ఆలేరులోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల విస్తీర్ణానికి సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు అమ్మే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ దీప్తి ఉన్నారు.

సంరక్షణ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

రామన్నపేట, జూన్15 : స్థానిక సంరక్షణ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటె గణేశ్, ఉపాధ్యక్షులుగా కొండె వెంకటేశ్, గొరిగె విష్ణు, ప్రధాన కార్యదర్శిగా గొరిగె ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా చిందం వేణు, బండ మల్లికార్జున్, మోటె బీరప్ప, పల్లె ఉమామహేశ్వర్, ఏనుగు అచ్చాలు ఎన్నిక అయ్యారు. కార్యక్రమంలో తాపాల క్రాంతికుమార్, మిర్యాల మల్లేశ్, మోటె రమేశ్, మహేశ్, బండ గణేశ్, శేఖర్, నాగేశ్, శ్రీశైలం, ఉపేందర్, రాజు, బాలరాజు పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ వెదజల్లడం అభినందనీయం

● ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్



రాయరావుపేటలో సీడ్ బాల్స్ వెదజల్లుతున్న స్టేట్ స్ట్రీట్ వలంటీర్లు

బీబీనగర్, జూన్ 15 : ఖాళీ ప్రదేశాలు, గుట్టల్లో సీడ్ బాల్స్ వెదజల్లడం అభినందనీయమని ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని రాయరావుపేటలో స్టేట్ స్ట్రీట్ ఫౌండేషన్, మోటివేషన్ ఇండియా సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఖాళీ ప్రదేశాలు, గుట్టల ప్రాంతాల్లో 5 వేల సీడ్‌బాల్స్ 120మంది వలంటీర్ల సహకారంతో వెదజల్లారు. అనంతరం నెమరగోములలో రహదారికి ఇరువైపులా 250 మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్, మోటివేషన్ ఇండియా ప్రతినిధులు ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలి : మేనేజర్

బ్యాంక్ కరపత్రాలను విడుదల చేస్తున్న డీసీసీబీ మేనేజర్ షరీఫ్

రాజాపేట, జూన్ 15 : డీసీసీబీ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ ఎండీ షరీఫ్ కోరారు. శనివారం మండలంలోని కుర్రారంలో బ్యాంక్ డిపాజిట్లు, సేవింగ్, కరెంట్ అకౌంట్లు, లాకర్, గోల్డ్ లోన్, ఇతర రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, బ్యాంక్ సీఈఓ సిల్వేరు శేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్‌రావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్కట్‌పల్లిలో బడిబాట ర్యాలీ

వర్కట్‌పల్లిలో ఆచార్య జయశంకర్ బడి బాట, బాలిక విద్యాదివస్ సందర్భంగా విద్యార్థులు, మహిళ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ.

వలిగొండ, జూన్ 15 : మండలంలోని వర్కట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బాలిక విద్యా దివస్ పురస్కరించుకొని ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనీఫ్ అహ్మద్ మాట్లాడుతూ.. బడి బయటి, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మీసాల సంధ్య, నిర్మల, ఉపాధ్యాయులు మహేశ్వర్, శ్రీనివాస్, స్వప్న పాల్గొన్నారు.

యూనిఫామ్ పంపిణీ

రాజాపేట : మండలంలోని కుర్రారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్లు శనివారం యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణ, రాజు, లక్ష్మి, సామ్రాజ్యం, సుజాత, కల్యాణి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలత పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మోత్కూరు : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో 27 మంది

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : పట్టణ కేంద్రంలోని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో భాగంగా శనివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో 27 మంది అభ్యర్థులు నిలిచినట్లు ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. చివరి రోజు జనరల్ అభ్యర్థులు-11 మంది, మహిళలు-3, ఎస్సీ-3 తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాగా, రెండు మహిళా స్థానాలకు ముగ్గురు, ఒక ఎస్సీ స్థానానికి ఇద్దరు, ఆరు జనరల్ స్థానాలకు 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. కాగా, ఈ నెల 21న ఎన్నికలు జరుగనున్నాయి.

ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా లోకేశ్వర్‌రెడ్డి

లోకేశ్వర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), జూన్15 : కలెక్టర్ కార్యాలయంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సూపరింటెండెంట్‌గా పని చేన ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి ఆత్మకూరు(ఎం) మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన విక్టరీజోబ్ నల్లగొండ జిల్లా దేవరకొండ మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

బీబీనగర్, జూన్ 15 : మండలంలోని కొండమడుగులో గల పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాషబోయిన పెంటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అరిగె వెంకటేశ్, పెంటబోయిన రాము, కనకబోయిన నాగరాజు, గోపాల్, ఆరుముల్ల జహంగీర్, బాలరాజు, పొన్న మహేశ్, రాజమల్లేశ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

మోత్కూరు, జూన్ 15 : మోత్కూర్ ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సంక్షేమాధికారి రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ 3వ తరగతి నుంచి చదువుతున్న బాలురు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతోపాటు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేయాలని, పూర్తి వివరాల కోసం 9959646811నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ చోరీ

చౌటుప్పల రూరల్, జూన్ 15 : మండలంలోని కుంట్లగూడెం, మందళ్లగూడెం, సింగరాయచెర్వు గ్రామాల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లకు ఉన్న కేబుల్ వైర్‌ను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆయా గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు పలుమార్లు జరిగాయని, చోరీ కి పాల్పడే వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని పోలీసులను కోరినట్లు గ్రామస్తులు తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టికి ప్రభుత్వ విప్ శుభాకాంక్షలు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జూన్ 15 : రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ ముఖ్యమంత్రిని కలిసి లక్ష్మీ నరసింహ స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన వెంట యాదగిరిగుట్ట దేవస్థాన ఈఓ భాస్కర్‌రావు ఉన్నారు.

వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రామన్నపేట(వలిగొండ), జూన్ 15 : వలిగొండ మండలం వెంకటాపురంలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన అనుబంధ ఆలయం వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 24 వరకు జరుగనున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ మోహన్‌బాబు, కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, కొత్త వెంకటేశం, జక్కల రోషయ్య, అర్చకులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న మాజీ సర్పంచ్ కృష్ణ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో బండి దయాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి((2023-24)లో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మాజీ సర్పంచ్ బండి కృష్ణ మెమెంటోలతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమములో ప్రధానోపాధ్యాయుడు గురునాథం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఎర్ర వెంకటేశ్, పెద్దిరెడ్డి యాదగిరి, బండి రవి, గడ్డం చంద్రశేఖర్, భీమగోని రాజారాం, గడ్డం శెట్టి, బండి గోవర్ధన్, రేవల్లి అశోక్, కుమ్మరి బుచ్చిబాబు, తోట లింగస్వామి పాల్గొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

రవీందర్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వేములయ్య

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూదాన్‌పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లికి చెందిన సుర్వి రవీందర్‌గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సుర్వి రవీందర్ మాట్లాడుతూ గౌడ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మిద్దెల మల్లేశం, రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్, ఉపాధ్యక్షురాలు బోయపల్లి శ్రీలతకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి

అడ్డగూడూరులో మానవ వనరుల కేంద్రంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అడ్డగూడూరు, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని లోయర్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ క్రాంతికుమార్‌కు శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సాయి, బన్ని పాల్గొన్నారు.

నార్మాక్స్ డైరెక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డికి సన్మానం

లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న పాలశీతలీకరణ కేంద్రం ఉద్యోగులు

మోత్కూరు, జూన్ 15 : నార్మాక్స్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు మదర్ డైరీ ఉద్యోగ భద్రత కల్పించడం పట్ల నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డిని నార్మాక్స్ ఉద్యోగులు సన్మానించారు. శనివారం మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రంలో ఉద్యోగులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. 238 మంది ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పించడంతోపాటు 181 మంది ఉద్యోగులకు వివిధ స్థాయిల్లో పదోన్నతి కల్పించారు. కార్మికులు హర్షం వ్యక్తంచ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ జే శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాస్, ఉద్యోగులు మధు, కిరణ్, రాంరెడ్డి, సాయిరాం పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుకు మోక్షమెప్పుడో!

కంకర పోసి వదిలేసిన మల్లెగూడెం రోడ్డు

రాజాపేట మండలంలోని మల్లెగూడేనికి బీటీ రోడ్డు వేసేందుకు 2022లో అప్పటి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. దాంతో తమ గ్రామానికి బీటీ రోడ్డు వచ్చిందని గ్రామస